సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



అన్నదాన పథకానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మద్దిపాటి వీర్రాజు దంపతులు (చెల్లూరు) రూ.1,01,116 విరాళాన్ని గురువారం సమర్పించారు.



కట్టుదిట్టంగా నేరగాళ్ల కట్టడి

రాజమహేంద్రవరంలో నమస్యాత్మకంగా ఉన్న మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు పోలీసులు ప్రణాళికా బద్ధంగా చర్యలకు సిద్ధమయ్యారు. -8లో▸

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 1,79,553 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 20.40, బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

మాజీ సర్పంచ్ నరసింహరాజు సేవలు అభినందనీయం



నరసింహరాజు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: దివంగత నేత, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ మాజీ సర్పంచ్ పేరిచర్ల నరసింహరాజు సేవలు అభినందనీయమని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కొనియాడారు. గురువారం నరసింహరాజు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జగ్గిరెడ్డి చేతుల మీదుగా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈయన రాజకీయ రంగ ప్రవేశం చేసి 25 సంవత్సరాల పాటు సర్పంచ్‌గా గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సర్పంచ్‌తో పాటు, ఎంపీటీసీ సభ్యుడిగా పని చేయడమేకాక, ఎన్నో పదవులను చేపట్టారన్నారు. తన తండ్రి చిర్ల సోమసుందరరెడ్డి హయాం నుంచి తమ వెంట ఉంటూ రాజకీయంగా మంచి మెళకువలు చెప్పేవారన్నారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రత్నగిరిపై స్థలం కోరిన పర్యాటక శాఖ



అన్నవరం: రత్నగిరిపై కొలువైన సత్యదేవుని సన్నిధిలో అతిథిగృహం నిర్మించేందుకు 500 గజాల స్థలం కేటాయించాలని టూరిజం శాఖ అన్నవరం దేవస్థానం అధికారులను కోరింది. ఈ మేరకు టూరిజం శాఖ ఉన్నతాధికారులు గురువారం దేవస్థానానికి లేఖ రాశారు. దేవస్థానంలో అతిథిగృహాలు నిర్మించే దాతలకు తప్ప మరే ఇతర ప్రభుత్వ శాఖలకు స్థలాలివ్వలేదు. గతంలో రెవెన్యూ శాఖ దేవస్థానం స్థలంలో అతిథి గృహం సగం వరకు నిర్మించాక దేవస్థానం ఆ నిర్మాణ మొత్తాన్ని చెల్లించి స్వాధీనం చేసుకుంది. టూరిజం శాఖ లేఖపై దేవస్థానం అధికారులు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది. దేవస్థానమే సత్రాలు నిర్మించి భక్తులకు అద్దెకు ఇస్తుందని అధికారులు తెలిపారు. టూరిజం శాఖకు స్థలమిస్తే మిగిలిన ప్రభుత్వ శాఖలు కూడా అడిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఎంబీఏ, ఎంసీఏలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే గురువారం నిర్వహించిన ఎంబీఏ,ఎంసీఏ సీట్ల కౌన్సెలింగ్‌లో 14 మంది అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించారు. అడ్మిషన్ల డైరెక్టర్ ఏ.ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ గోపాలకృష్ణ,కృష్ణ ప్రసాద్‌లు అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంబీఏ కోర్సులో తొమ్మిది మందికి, ఎంసీఏలో ఐదుగురికి అడ్మిషన్లు కేటాయించారు. ఎంసీఏకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో వీసీ అనుమతితో మరో ఐదు సీట్ల భర్తీకి చర్యలు తీసుకుంటున్నట్లు అడ్మిషన్ డైరెక్టర్ తెలిపారు.


మంచినీళ్లకు నిధుల వరద



- అమృత్ 2.0 కింద మంజూరు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.478.08 కోట్లు
- రాష్ట్రం, స్థానిక సంస్థల నుంచి రూ.302.05 కోట్లు
- కేంద్రం వాటా రూ.176.03 కోట్లు
- జగనన్న కాలనీల్లోను రక్షిత నీటి సదుపాయాల కల్పన
- సర్ఫేస్ స్టోరేజ్ ట్యాంకులు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటుల ఏర్పాటు
- డీపీఆర్ కోరిన ప్రభుత్వం
- సిద్ధం చేసే పనిలో నగర, పురపాలక సంస్థల అధికారులు



మండపేటలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటుకు ప్రతిపాదిత స్థలం



మండపేట: పట్టణాలకు పూర్తిస్థాయిలో రక్షిత నీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమృత్ 2.0 పథకం కింద నగర, పురపాలక సంస్థలు, నగర పంచాయతీలకు నిధులు మంజూరు చేసింది. కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీలతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మొత్తం రూ.478.08 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థల నుంచి రూ.302.05 కోట్లు, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.176.03 కోట్లు వెచ్చించనున్నారు. చేపట్టే పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారీలో అధికారులు నిమగ్నమయ్యారు.

అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0 పథకం కింద పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెరిగిన జనావాసాలకు అనుగుణంగా పైప్‌లైన్ల విస్తరణ, గడువు తీరిన పైప్‌లైన్లు తొలగించి ఆధునిక హెచ్‌డీపీఈ పైప్‌లైన్ల ఏర్పాటు, సర్ఫేస్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణం, సంప్ ఫిల్టరేషన్ ప్లాంటు, క్లోరినేషన్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న వాటిని మరింతగా అభివృద్ధి చేసేందుకు ఆదేశాలిచ్చింది. ఆయా పనుల అంచనా వ్యయంలో 40 నుంచి 50 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇవ్వనుండగా, మిగిలిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం, అర్బన్ లోకల్ బాడీ (యూఎల్‌బీ) నిధుల నుంచి వెచ్చించనున్నారు.

మంజూరు చేసిన నిధుల నుంచి కాకినాడ కార్పొరేషన్‌లో మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు కోసం రూ.95.23 కోట్లు, రాజమహేంద్రవరంలో తాగునీటి చెరువుల అభివృద్ధికి రూ.10.4 కోట్లు, రామచంద్రపురంలో ఎస్ఎస్ ట్యాంకు శుద్ధీకరణకు రూ.1.1 కోట్లు, గొల్లప్రోలులో తాగునీటి చెరువు శుద్ధీకరణకు రూ.4.1 కోట్లు కేటాయింపులు చేసింది. పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, ముమ్మిడివరంలోని నగర పంచాయతీల్లో రక్షిత నీటి వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది.

డీపీఆర్‌ల తయారీలో నిమగ్నం

ప్రస్తుతం ఉన్న తాగునీటి వనరులకు అనుగుణంగా ఈ నిధులతో చేపట్టనున్న పనులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాలని స్థానిక సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు సర్వే బాధ్యతలను గుర్తింపు పొందిన ప్రైవేట్ కన్సల్టెన్సీ ఏజెన్సీలకు అప్పగించేందుకు టెండర్లు పిలిచే పనిలో నగర, పురపాలక సంస్థల అధికారులు నిమగ్నమయ్యారు. సర్వే అనంతరం ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నారు. ఆయా పనులు పూర్తయితే పట్టణ ప్రాంతాల్లో రక్షితనీటి సమస్యలకు తెరపడనుందని అధికారులు అంటున్నారు.

మంజూరైన నిధుల వివరాలు (రూ.కోట్లలో)

	కేంద్రం	రాష్ట్రం యూఎల్‌బీ	మొత్తం
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా..			
అమలాపురం	4.62	4.77	9.39
మండపేట	11	13	24
రామచంద్రపురం	6.75	7.85	14.6
ముమ్మిడివరం	7.58	8.08	15.66
కాకినాడ జిల్లా..			
కాకినాడ	65.71	150.07	215.78
పిఠాపురం	15.05	16.05	31.1
పెద్దాపురం	6.42	6.72	13.14
సామర్లకోట	12.61	13.61	26.22
తుని	6.47	6.97	13.44
గొల్లప్రోలు	2.99	3.09	6.08
ఏలేశ్వరం	1.69	1.69	3.38
తూర్పుగోదావరి జిల్లా..			
రాజమహేంద్రవరం	28.81	63.82	92.63
నిడదవోలు	2.65	2.65	5.3
కొవ్వూరు	3.68	3.68	7.36



మండపేట ఏరియల్ వ్యూ

టెండర్లు పిలిచేందుకు చర్యలు



అమృత్ 2.0 పథకం కింద మండపేటకు రూ.24 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారీ బాధ్యతలను ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించేందుకు ఇప్పటికే కౌన్సిల్‌లో తీర్మానం అయింది. త్వరలో టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మండపేట

వైద్య సేవలు అవసరమైన వారికి అండ

మంత్రి వేణు



వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్య సేవలు అవసరమైన వారందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న ఆరోగ్య సురక్ష' పథకం ద్వారా కొండంత అండగా నిలుస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం మండలంలోని ఏరుపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నాడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకంతో పేదలను ఆదుకున్నారన్నారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో పదడుగులు ముందుకు వేసి వైద్య సేవలను ఇంటి ముంగిటకు చేరుస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. మనకు ప్రభుత్వ వైద్యులు అన్ని వేళలా అండగా ఉంటారన్న భరోసాను రాష్ట్ర ప్రజలకు కల్పిస్తున్నారని మంత్రి వేణు తెలిపారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యసేవలు పొందడానికి వచ్చిన వారితో మంత్రి వేణు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లి మొగ్గల శ్రీధర్, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకన్న బాబు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, సర్పంచ్‌లు కట్టా గోవిందు, వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్, ఎంపీడీఓ ఎన్.కీర్తిస్పందన, తహసీల్దార్ జి.శ్రీనివాసు, ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్పెషలిస్టు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న నాగభూషణం. చిత్రంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమ్మలాపురం టౌన్: దాదాపు 50 ఏళ్లుగా బీసీ కుల గణన చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అడుగుతూనే ఉన్నాం. ఇన్నేళ్లకు బీసీ కుల గణనకు ముందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఉత్తరాంధ్ర బీసీ కుల గణన సమాఖ్య చైర్మన్ బి.నాగభూషణం అన్నారు. స్థానికంగా ఓ హోటల్‌లో గురువారం జరిగిన బీసీ నేతల సమావేశంలో నాగభూషణం మాట్లాడారు. ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాగ భూషణం మాట్లాడుతూ 1931లో బ్రిటీషు కాలంలో జరిగిన బీసీ కుల గణన తర్వాత ఎలాంటి గణన జరగలేదని చెప్పారు. మేము రాజ్యాధికారం అడగడం లేదు. బీసీలను లెక్కించి జనాభా ఆధారంగా నిధులు ఇచ్చి మా సామాజిక అభివృద్ధికి పాటుపడాలని కోరుతున్నామని చెప్పారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చేపడుతున్న బీసీ కుల గణన ద్వారా తమ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని చెప్పారు. కుల గణన ద్వారా బీసీల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ తెర తీస్తున్నారని పేర్కొన్నారు. తమ కులాలను సంపద సృష్టించే కులాలుగా మార్చుతున్నారని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి డబ్బులు పంపిస్తున్న ముఖ్యమంత్రి జగన్ ముఖ్యంగా బీసీల ఆర్థిక జీవన ప్రమాణాలు మెరుగు పరుస్తున్నారని తెలిపారు. ఇప్పుడు కుల గణన పూర్తయి, స్పష్టత వస్తే బీసీలకు పెద్ద పీట వేసినట్లే అవుతుందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కుడుపూడి త్రినాథ్, దండుమేను రూపేష్, గుత్తుల భాను, ముంగర ప్రసాద్, యనమదల కరుణాకర్, కడలి దుర్గాకృష్ణ ప్రసంగించారు.

మారనున్న రూపురేఖలు



రావులపాలెం ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం బస్‌స్టాండ్‌ను సందర్శించిన ఎండీ ద్వారకా తిరుమలరావు

రావులపాలెం: రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలకు రాకపోకలకు వీలుగా ఉండటంతోపాటు ఎంతో ప్రాధాన్యం కలిగిన రావులపాలెం బస్టాండ్ రూపురేఖలు మారనున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితో కలసి రావులపాలెం బస్ డిపోను, బస్టాండ్‌ను సందర్శించారు. రావులపాలెం బస్టాండ్‌కు కొత్త రూపురేఖలు ఇవ్వాలని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఎంతో కృషి చేశారు. 38 సంవత్సరాల క్రితం నిర్మించడం వలన, చుట్టూ ఉన్న 216ఏ జాతీయ రహదారి, ఇతర రహదారుల ఎత్తు పెరిగిపోవడం వలన వర్షం వస్తే బస్టాండ్లో నీరు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో గురువారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు స్వయంగా వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వస్తే మునిగిపోయే పరిస్థితిలో ఉన్న రావులపాలెం బస్టాండ్‌ను కొత్తగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య (పి.పి.పి) పద్ధతిలో అత్యాధునిక హంగులతో బస్టాండ్ నిర్మిస్తామన్నారు. ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీకి సొంత డీజిల్ వాహనాలు 1,500 బస్సులను కొనుగోలు చేశామన్నారు. త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు 1,000 కొనుగోలు చేస్తున్నామన్నారు. దసరాకు 5,000లకు పైగా ప్రత్యేక బస్సులు వేస్తున్నామన్నారు. వీటికి అదనపు రుసుములు వసూలు చేయకుండా నడుపుతున్నామన్నారు. అప్ అండ్ డౌన్ ముందుగా బుక్ చేసుకున్న వారికి 10 శాతం డిస్కౌంట్ కూడా కల్పిస్తున్నామన్నారు. ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని ఆయన కోరారు. ఆయన వెంట ఆర్ఎం ఆర్‌పీఎస్ నాగేశ్వరరావు, డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ ఉన్నారు.

ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దు



- మార్కెట్‌లో జోరుగా నకిలీ మందులు
- ప్రజారోగ్యంతో చెలగాటం
- బ్రాండెడ్ కంపెనీ పేర్లతో టోకరా
- డ్రగ్స్ అధికారుల తనిఖీల్లో బహిర్గతం
- అవగాహన ఒక్కటే దీనికి మందు
- ఔషధ నియంత్రణ శాఖ గట్టి నిఘా



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కొన్ని రకాల మందులు ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నాయి. నకిలీ, నిషేధిత మందుల వినియోగం ప్రాణాంతకంగా మారింది. ఔషధ నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నా ఈ విక్రయాలు ఉనికి చాటుకుంటూనే ఉన్నాయి. సాధారణ ప్రజలకే కాదు చదువుకున్న వారికీ మందులపై లోతైన అవగాహన లేకపోవడంతో వీటి అమ్మకాలు జోరందుకుంటున్నాయి. మార్కెట్‌లో అధిక లాభాపేక్షతో మందుల షాపుల యజమానులు ఈ తరహా ఔషధాలు విక్రయిస్తున్నారు. ఇలాంటి మందులు ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయి.

ధనార్జనే ధ్యేయంగా..

మార్కెట్లో నకిలీ మందుల విక్రయాలు పెరిగిపోతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొన్ని చిన్నపాటి మందుల కంపెనీలు నకిలీలతో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. మందుల పేరులో కొద్దిపాటు అక్షరాల మార్పుతో తప్పుదారి పట్టిస్తున్నాయి. సాధారణంగా జ్వరానికి పారాసిట్‌మాల్ టాబ్లెట్‌ను వాడతారు. ఈ మందునే కొన్ని కంపెనీలు తమ బ్రాండ్లతో విక్రయిస్తుంటాయి. ఇదే మందు డోలో–650 పేరిట కూడా మార్కెట్లో లభ్యమవుతుంది. కానీ కొన్ని మోసపూరిత కంపెనీలు డోలో పేరును రకరకాలుగా ముద్రించి గుర్తించలేని విధంగా నకిలీవి తయారు చేస్తున్నాయి. ఇది ఉదాహరణ మాత్రమే. ఇలా చాలా మందుల్ని ప్రజలు గుర్తించలేకపోతున్నారు. మందుల షాపు వాళ్లు ఇచ్చినవి తీసుకుంటున్నారు. కనీసం ఈ మందు అసలైనదా కాదా అని పరిశీలించే అవగాహన కొరవడుతోంది. ఈ బలహీనతే మందుల షాపులకు..కంపెనీలకు కలిసివస్తోంది. ప్రస్తుతం నకిలీ మందులే ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ తరహా మందులు వాడినా ప్రయోజనం పెద్దగా ఉండదు. పైగా అనారోగ్యం పెరుగుతుంది. మందుల వ్యాపారంలో వచ్చిన ఈ ధోరణి అత్యంత ప్రమాదకరమని ఔషధ నియంత్రణ శాఖ హెచ్చరిస్తోంది.

పల్లెల్లో టోకరా

కార్పొరేట్ లేదా పేరున్న మందుల షాపుల్లో నకిలీలకు ఆస్కారం తక్కువ. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా మందులను అధికంగా అమ్ముతున్నట్లు గుర్తించారు. చాలామంది అధికంగా గ్యాస్ట్రిక్ ట్యాబెట్లు కొంటుంటారు. పేంటాప్రజోల్ మందు దీని నివారణకు ఉపయోగపడుతుంది. ఈ మందుతో రకరకాల టాబ్లెట్లు వచ్చాయి. పేంటాప్ బ్రాండ్ పేరు. కానీ కొన్నింటిపై ఎక్కడోచోట చిన్నపాటి అక్షరం మార్చి పేంటాప్ మాత్రగా భ్రమింపజేస్తున్నారు. అవగాహన లేక చాలామంది వీటిని కొనుగోలు చేస్తున్నారు. నెల రోజుల వ్యవధిలో తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరు జిల్లాల్లో రూ.లక్ష విలువైన నకిలీ మందులను పట్టుకున్నారు. కొలస్ట్రాల్ తగ్గుదలకు రోస్‌వాస్..సుగర్‌కు గ్లూకోనార్మ్..ఫిట్స్‌కు గబాపెండింగ్..బీపీకి టెల్మా-హెచ్..జీర్ణాశయ అల్సర్లకు పెంటాప్-డీఎస్సార్ మందులు వాడుతుంటారు. కానీ ఈ మందులకు సంబంధించి గుంటూరు, విజయవాడ, నరసరావుపేటల నుంచి నకిలీలు ఎక్కువగా మార్కెట్లో అమ్ముతున్నారు. మందుల వాడకం విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాల్సిందే. లేనిపక్షంలో ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిషేధిత మందులు వాడొద్దు

నిమ్సులైడ్, సిట్రిజన్ హైడ్రోక్లోరైడ్,, లివోసిట్రిజన్,పారాసిటమాల్ బ్రోమోహెక్సైన్,యామ్‌బ్రాక్సల్ లాంటి మందులతో నకిలీలు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు ఇటీవల దాడుల్లో గుర్తించారు. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాంచల్, హరిద్వార్, బద్ది వంటి ప్రాంతాల్లోని కంపెనీలు ఈ మందులను రకరకాల పేరుతో నకిలీవి తయారు చేసున్నాయి. 12 ఏళ్లలోపు వయసున్న వారికి నిమ్సులైడ్ మందు వాడకూడదు. దీనిని నిషేధించారు. అయినా యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ప్రాణానికి హానిచేసే 200 రకాల ఔషధాలను నిషేధించారు.

ఏం చేయాలి

- లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేయాలి.
- అన్ని అర్హతలూ ఉన్న వైద్యులతోనే చికిత్స చేయించు కోవాలి.
- మందులు తీసుకునేటప్పుడు బిల్లు రాయించుకోవాలి.
- ఆయా మందులు వాడేటప్పుడు అలర్జీ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపి సంబంధిత డాక్టరుకు, డ్రగ్స్ అధికారులకు తెలియజేయాలి.
- మందుల నాణ్యతపై అనుమానమొస్తే వెంటనే ఔషధ తనిఖీ అధికారికి సమాచారమివ్వాలి
- ఫిర్యాదు చేస్తే సంబంధిత మందును లేబరొటరీ పరీక్షలకు పంపుతారు.

క్లుప్తంగా

దుబాయ్‌లో నగరం వాసి అదృశ్యం

ఏపీఎన్ఆర్టీకి భార్య ఫిర్యాదు


సురేష్ (ఫైల్)

మామిడికుదురు: ఉపాధి కోసం దుబాయ్ వెళ్లిన నగరం గ్రామంలోని కోటమెరకకు చెందిన చింతా సురేష్ (35) ఆచూకీ పది రోజుల నుంచి తెలియడం లేదంటూ అతని భార్య చింతా విజయకుమారి గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ నాన్- రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్టీ) సీఈఓకు దరఖాస్తు చేశారు. తమది పేద కుటుంబమని, కూలీ పని చేసుకుని జీవనం సాగించే తమకు 11 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నాడని పేర్కొంది. ఏడాదిన్నర క్రితం తన భర్త సురేష్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడని ప్రతి రోజూ తనకు ఫోన్ చేసి తనతో మాట్లాడేవాడని దరఖాస్తులో రాసింది. పది రోజుల నుంచి అతని దగ్గర నుంచి ఏవిధమైన సమాచారం లేదని విజయకుమారి వాపోయింది. అదే దేశంలో ఉన్న సురేష్ స్నేహితులకు ఫోన్ చేసినా ఏం జరిగిందో కూడా చెప్పలేకపోతున్నారని వివరించింది. ఆర్థికంగా తాము చాలా ఇబ్బంది పడుతున్నామని, పూట గడవడం కూడా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించి తన భర్త సమాచారం తెలుసుకుని స్వగ్రామానికి రప్పించే ప్రయత్నం చేయాలని అభ్యర్థించింది. తన భర్త ఆచూకీ కనుగొనేలా అధికారులను ఆదేశించాలని అమలాపురం ఎంపీ చింతా అనురాధకు బాధితురాలు వినతిపత్రం అందజేసింది.

పేకాడుతున్న 10 మంది అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి చెందుర్తి గ్రామాల మధ్య పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడులు చేసి 10 మందిని అరెస్టు చేసి నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. రెండు పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు చేయగా ఒక శిబిరంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశామని వారి వద్ద నుంచి రూ.11,410, రెండవ శిబిరంలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.13,500లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కట్టుదిట్టంగా నేరగాళ్ల కట్టడి

- 124 మంది రౌడీషీటర్లు ఉన్న ప్రాంతంపై ప్రత్యేక దృష్టి
- వారం వారం పిలిపించి కౌన్సెలింగ్
- సెక్టార్లుగా విభజించి పర్యవేక్షణ



కంబాలచెరువు: రాజమహేంద్రవరం నగరంలో అత్యంత సమస్యాత్మకంగా పేరుగాంచిన మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. రాజమహేంద్రవరం నగరంతో పాటు రూరల్ ప్రాంతాలైన మల్లయ్యపేట, కాతేరు, వెంకటనగరం తదితర ప్రాంతాల మేళవింపుతో ఈ స్టేషన్ పరిధి విస్తరించింది. స్టేషన్లో ఎక్కువ మురికివాడలు ఉండటం, నేరగాళ్లకు నిలయంగా అవి మారుతుండటంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో శాంతిభద్రతల సమస్యతో స్టేషన్ సిబ్బంది పరుగులు తీస్తూనే ఉంటారు. ఈ స్టేషన్ పరిధిలోనే మొత్తం 124 మంది రౌడీషీటర్లు ఉన్నారంటే ఆ ప్రాంతంలో శాంతి భద్రతల సమస్య ఎంత జటిలంగా ఉంటుందో అంచనా వేయవచ్చు. బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్, రౌడీషీటర్లు త్రీటౌన్ స్టేషన్ పరిధిలోనే అధికంగా ఉన్నారు. ఇటీవల కాలంలో అర్బన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పి.జగదీష్ నగరంలో సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు దృష్టి సారించారు. దీనిలో భాగంగా మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడవద్దని, నేరగాళ్ల కట్టడికి కఠినంగానే వ్యవహరించమని ఆదేశాలు జారీ చేయడంతో స్టేషన్ అధికారులు ఆ దిశగా ముందుకు వెళుతున్నారు.

ఫోన్ నంబర్లు..

3 టౌన్ పోలీసు స్టేషన్	:	08832471273
ఇన్‌స్పెక్టర్	:	94407 96532
సెక్టార్ 1, ఎస్సై	:	80080 14043
సెక్టార్ 2, ఎస్సై	:	94903 45517
సెక్టార్ 3, ఎస్సై	:	93462 94963
సెక్టార్ 4, ఎస్సై	:	70139 10804

నాలుగు సెక్టార్లుగా విభజన

పర్యవేక్షణ సౌలభ్యం కోసం మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిని నాలుగు సెక్టార్లుగా విభజించి నలుగురు ఎస్సైలను నియమించారు. ఒకో సెక్టారుకు ఒక ఎస్సైకి పర్యవేక్షణ బాధ్యత అప్పగించి, మొత్తం స్టేషన్ పరిధిని ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షిస్తున్నారు.

- **సెక్టార్-1:** దేవీచౌక్, లక్ష్మీవారపు పేట, సూర్యా థియేటర్ ప్రాంతం, కంబాలపేట, గణేష్ చౌక్, జాం పేట, గంటాలమ్మ గుడి ప్రాంతం, జెండా పంజారోడ్డు, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం సెంటరు, పుష్కరఘాట్, రంగ్రీజుపేట, మోచీవీధి, మెయిన్ రోడ్డు, పప్పులు వీధి, బెస్తావీధి, నల్లమందు సందు ప్రాంతాలు.
- **సెక్టార్-2:** కంబాలచెరువు ప్రాంతం, జయకష్ణపురం, ఆర్.వి.నగర్, విద్యానగర్, పీఅండ్‌టీ కాలనీ, వీవర్స్ కాలనీ, సారంగధర మెట్ట, టి.వి. రోడ్డు, బర్మాకాలనీ, క్వారీ ప్రాంతం, సింహాచలనగర్, సుబ్బారావునగర్, సంజీవనగర్, చోడేశ్వరనగర్, జయనగర్, భాస్కరనగర్, సీటీఆర్ ప్రాంతం, మల్లికార్జుననగర్, ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్ట్స్ కాలేజీ ప్రాంతం.
- **సెక్టార్-3:** కంబాల చెరువు స్టేట్‌బ్యాంకు రోడ్డు నుంచి వీరభద్రపురం, లలితానగర్, హరిపురం, మున్సిపల్ కాలనీ, మార్కెట్ యార్డు, లూథర్ గిరి, శ్రీరామనగర్, కష్ణనగర్, ఏపీపీ మిల్స్ ప్రాంతం, రామచంద్రరావుపేట, శాంతినగర్, వెంకటాపురం, రావుగారి బిల్డింగ్స్, ఆనందనగర్, గాదిరెడ్డినగర్, ఇందిరానగర్, ఊటలంక, గణపతి నగర్ ప్రాంతం
- **సెక్టార్-4:** గోకవరం బస్టాండు, కోర్లమ్మపేట, తుమ్మలావ, ఆర్యాపురం, శేషయ్యమెట్ట, గోదావరిగట్టు, టింబర్ రోడ్డు, కోటిలింగాల పేట, ఆదెమ్మదిబ్బ, పేపరుమిల్లు ప్రాంతం, మల్లయ్యపేట, దర్గానగర్, వడ్డీలపేట, కాతేరు. సుబ్బారావుపేట, వెంకటనగరం ప్రాంతాలు

శాంతిభద్రతల విషయంలో రాజీ పడం



మూడో పట్టణ పోలీసే స్టేషన్ పరిధిలో ఎక్కువ స్లమ్ ఏరియాలు ఉండటంతో కొట్లాట కేసులపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ స్టేషన్ పరిధి నగరంలో ఎక్కువ ప్రాంతంలో విస్తరించి ఉండటం, పేపరుమిల్లు కార్మికుల సమస్యలు వంటి వాటి కారణంగా శాంతి భద్రతల పర్యవేక్షణకు కొంతమేర శ్రమించాల్సి ఉంటుంది. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు వారం వారం కౌన్సెలింగ్ ఇస్తున్నాం. స్టేషన్ రికార్డుల్లో ఉన్న నేరగాళ్లపై నిరంతరం నిఘా ఉంటుంది. గస్తీ పోలీసులు నిత్యం వారి కదలికలపై దృష్టి పెడతారు. శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేని ధోరణితో ముందుకు వెళతాం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్టేషన్ సిబ్బందితో సమావేశమై మార్గనిర్దేశం చేస్తాం.

– ఎస్‌పీ వీరయ్యగౌడ్, త్రీటౌన్ సీఐ, రాజమహేంద్రవరం

కార్మికులకు వరం

ఈ -శ్రమ్ పోర్టల్


నాగలక్ష్మి, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్

సాక్షి అమలాపురం: ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత కార్మికులు, వలస కార్మికులకు పలు ప్రయోజనాలను కల్పిస్తున్నామని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి గురువారం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశంతో ఈ -శ్రమ్ పోర్టల్‌ను ప్రవేశపెట్టగా నమోదు చేసుకున్న అసంఘటిత రంగ, వలస కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తి పనివారు, వీధి వ్యాపారులు, ఆశ వర్కర్స్, అంగన్ వాడి వర్కర్స్, మత్స్యకారులు, మొక్కలు పెంచే కూలీలు ఉపాధి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, పాల వ్యాపారులు, కొరియర్ బాయ్స్, లఘు వ్యాపారులు ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేనివారు, ఆదాయపు పన్ను చెల్లించనివారు, 16–59 సంవత్సరాల వయసు గలవారు అర్హులు అని తెలిపారు. జిల్లాలో 2,62,292 మందిని ఇప్పటి వరకు నమోదు చేశామన్నారు. నమోదు అయినవారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ప్రతి ఏడాది ప్రీమియం చెల్లించవలసిన అవసరం లేదన్నారు. సామాజిక భద్రత సంక్షేమ పథకాల కింద ప్రయోజనాలు అంద జేస్తారన్నారు. ఉపాధిని, నైపుణ్యాభివృద్ధిని కల్పించేందుకు ఈ డేటాబేస్ ఆధారపడుతుందన్నారు. నమోదు అయిన కార్మికులు ప్రమాదవశాత్తూ మరణించినా, అంగవైకల్యం పొందినా ఎక్స్ గ్రేషియా సొమ్ము కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సిఫారసుల మేరకు అందజేస్తామన్నారు. నమోదైన వలస కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు.

అమ్మవారి నగలు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

- రూ.30 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జగదీష్


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం)/పెరవలి: రూ.30 లక్షల విలువైన దేవుని బంగారు నగల అపహరణ కేసులో ఇంటిదొంగను రెండు రోజుల్లో పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద 58 కాసుల బంగారు, 21 గ్రాముల డైమండ్ నగలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి జిల్లా ఎస్పీ పి.జగదీష్ స్థానిక దిశ పోలీస్ స్టేషన్‌లో గురువారం మీడియా సమావేశం నిర్వహించి వివరాలను తెలిపారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని పెరవలి మండలం ముక్కామలలోని శ్రీధర స్వామీజీ ఆశ్రమంలో ఈ నెల మూడో తేదీన అమ్మవారికి అలంకరించే బంగారం, వజ్రాల నగలు చోరీ అయ్యాయి. దీనిపై స్వామీజీ అర్చిష్‌శ్రేష్ఠి పెరవలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొవ్వూరు ఎస్‌డీపీవో వీఎస్ఎన్.వర్మ పర్యవేక్షణలో నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావు, ఎస్సై ఎం.సూర్యభగవాన్, కొవ్వూరు ఎస్సై పి.రవీంద్రలతో కూడిన పోలీసు బృందాలు నేరస్తుడి కోసం గాలించాయి. ఈ పనిచేసింది ఆశ్రమంలో కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అత్తిలి మండలం, కొమ్మరకు చెందిన చింతలపాటి ధనరాజుగా పోలీసులు గుర్తించారు. అతని కదలికలపై నిఘా పెట్టారు. తణుకు నరేంద్ర సెంటర్, సాయి షూమార్ట్ ప్రాంతంలో దాడి చేసి ధనరాజును పట్టుకున్నారు. దొంగిలించిన బంగారు, వజ్రాల ఆభరణాలను అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసులు బుద్ధేశ్వరరావు, ఎస్.విజయ్‌శేఖర్, ఎన్‌వీ.రామాంజనేయులు, జి.సాంబయ్య, అఫ్సారీ బేగంలను ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇళ్లు వదిలి దూరప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులు అందించే ఎల్‌ఎంహెచ్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని, ఇది పూర్తి ఉచితంగా పోలీసులు వచ్చి అమర్చి వెళతారని తెలిపారు. ఊర్లు వెళుతున్నప్పుడు ఫేస్‌బుక్ వంటి వాటిలో ఇంటి నుంచి బయల్దేరినప్పటి నుంచి వారు ప్రయాణించే ప్రాంతాలకు చేరే వరకు లైవ్ అప్‌డేట్ ఇస్తున్నారని, ఇది దొంగలకు మంచి అవకాశంగా ఉంటుందన్నారు. ఈ విధానాన్ని మానాలన్నారు.

లింక్ రోడ్డు నిర్మాణానికి అనుమతి

రూ.1.24 కోట్లతో సిద్ధం కానున్న రహదారి


బీటీ రహదారిగా మారనున్న లింక్ రోడ్డు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తుల వాహనాల ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పాత సీఆర్వో కార్యాలయం వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ మూడో మలుపు వరకు చదును చేసిన రహదారిపై రూ.1.24 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మించేందుకు దేవదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ అనుమతి మంజూరు చేశారు. ఈ విషయాన్ని దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ గురువారం మీడియాకు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రెండు నెలల క్రితం రూ.1.19 కోట్ల అంచనా వ్యయంతో టెండర్ పిలిచారు. కాకినాడకు చెందిన శ్రీహర్ష ఇన్‌ఫ్రా టెక్ కంపెనీ 4.97 శాతం ఎక్కువకు టెండర్ కోట్ చేసి లోయెస్ట్‌గా నిలిచింది. దేవస్థానం అధికారులు రివర్స్ టెండరింగ్ కు వెళ్లగా ఆ సంస్థ ముందు కోట్ చేసిన దానికన్నా 0.5 శాతం తక్కువకు టెండర్ వేసింది. దాంతో దానిని ఖరారు చేసినట్టు, త్వరలో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను కోరినట్టు ఈఓ తెలిపారు.

తీరనున్న భక్తుల ఇబ్బందులు

గతంలో భక్తుల వాహనాలు దిగువకు వెళ్లాలంటే పాత సీఆర్వో ఆఫీసు, సహజ జంక్షన్, పశ్చిమ రాజగోపురం వై.జంక్షన్, తూర్పు రాజగోపురం వై.జంక్షన్ దాటి సెకండ్ ఘాట్ రోడ్ ద్వారా దిగువకు వెళ్లాల్సి వచ్చేది. పర్వదినాలలో వేలాదిగా తరలివచ్చే వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీంతో భక్తుల వాహనాలు త్వరగా దిగువకు వెళ్లేందుకు సీఆర్వో ఆఫీసు వెనుక నుంచి సెకండ్ ఘాట్‌రోడ్ మూడో మలుపు వరకు కొండను చదును చేసి ఈ లింక్ రహదారిని అధికారులు నిర్మించారు. 30 అడుగుల వెడల్పున, 400 మీటర్లు పొడవునా వేసిన ఈ రోడ్డుపై వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డుపై దశమి, ఏకాదశి, పౌర్ణమి, శని, ఆదివారాలు, ఇతర పర్వదినాలలో వాహనాలను సెక్యూరిటీ గార్డుల సహకారంతో నడుపుతున్నారు.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

7.350 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల


ఎరువుల షాపులో తనిఖీలు చేస్తున్న ఇన్‌చార్జి రీజనల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కుమార్, సిబ్బంది

నిడదవోలు: పట్టణంలో గురువారం ఎరువుల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఇన్‌చార్జి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని సత్యనారాయణ ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందుల షాపును తనిఖీ చేశారు. షాపు డీలర్ ఎస్ఎస్‌పీ (పవర్) ఎరువులను గత నెల 9న నెల్లూరులోని వినాయక ఆగ్రో ఫెర్టిలైజర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుంచి తీసుకువచ్చారు. అప్పటి నుండి ఈపీఓఎస్ మెషీన్‌లో నమోదు చేయకుండా ఎరువులను విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంగా నిడదవోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ సుమారు రూ.73,500 విలువైన 7.350 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. ఇన్‌చార్జ్ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాలలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపుల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఎవరైనా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను గరిష్ఠ అమ్మకపు ధర కన్న ఎక్కువ ధరకు విక్రయించినా, అక్రమ నిల్వలు చేసినా, నకిలీ విత్తనాలు విక్రయించినా షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ ముత్యాలనాయుడు, వ్యవసాయ అధికారి భార్గవమహేష్, కానిస్టేబుల్ వీరబాబు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


అధికారులు సీజ్ చేసిన వ్యాన్, పీడీఎస్ బియ్యం

రావులపాలెం: మండలంలోని ఈతకోట హైవే టోల్‌గేట్ వద్ద గురువారం విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు దాడి చేసి అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈతకోట టోల్ గేట్ సమీపంలో ఒక వ్యాన్‌లో పీడీఎస్ (రేషన్ బియ్యం) వెళుతున్నట్టు అందిన సమాచారంతో అధికారులు తనిఖీ నిర్వహించి వ్యాన్‌ను పట్టుకున్నారు. ఈ వాహనంలో 56 బస్తాలలో సుమారు 2,700 కేజీల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. ఆలమూరు గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గంగూలీ వీర గణేష్, అత్తిలి గ్రామానికి చెందిన బొర్రా మహేష్ నుంచి పీడీఎస్ బియ్యాన్ని కేజీ ఒక్కింటికి రూ.18కి కొనుగోలు చేసి అదే బియ్యాన్ని రూ.20 కి నర్సిపూడి గ్రామ పరిసర ప్రాంతాల్లో ఇటుక బట్టి కార్మికులకు అమ్మేందుకు అత్తిలి నుంచి ఆలమూరు మండలం నర్సిపూడి తరలిస్తున్నట్టు గుర్తించారు. బియ్యం రవాణాకు సంబంధించి సరైన బిల్లులు లేనందున సివిల్ సప్లయ్స్ అధికారులు రూ.3,08,000 విలువ గల వాహనాన్ని, అందులో ఉన్న 2,700 కేజీల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి 6–ఏ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వాహన యజమాని, బియ్యం ఓనర్, సంబంధిత వ్యక్తుల పై క్రిమినల్ కేసు నమోదుకు సిఫారసు చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, కానిస్టేబుల్ వీరబాబు, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

యాని‘మేతోర్’

- గూడాల స్త్రీ నిధి, ఉన్నతిలో రూ.5.45 లక్షలు స్వాహా
- 27 గ్రూపులకు చెందిన డబ్బు మాయం చేసిన యానిమేటర్
- స్త్రీ నిధి మేనేజర్ విచారణలో అవినీతి బట్టబయలు

అల్లవరం: అల్లవరం మండలం గూడాల గ్రామ సమైఖ్య సంఘంలో యానిమేటర్‌గా (వీఓఏ) విధులు నిర్వర్తిస్తున్న గోసంగి వెంకటరమణ స్త్రీ నిధి, ఉన్నతికి చెందిన నిధులు దుర్వినియోగానికి పాల్పడిందని అధికారులు గుర్తించారు. నాలుగేళ్ల క్రితం విధుల్లో జాయిన్ అయిన గూడాల–3 యానిమేటర్‌కు 44 గ్రూపుల బాధ్యతలను అప్పగించారు. యానిమేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ స్త్రీ నిధి, ఉన్నతికి ద్వారా పలు సంఘాల సభ్యులకు రుణాలు ఇప్పించారు. సభ్యుల రుణాలను వసూలు చేస్తూ బ్యాంక్‌లో జమ చేయకుండా రూ.5.45 లక్షల నిధులు దుర్వినియోగానికి పాల్పడింది. స్త్రీనిధి, ఉన్నతికి చెందిన రుణాలను సభ్యుల నుంచి వసూలు చేస్తున్నా స్త్రీ నిధి బ్యాంక్‌కు జమ కాకపోవడంతో స్త్రీ నిధి మేనేజర్ అవినేష్, ఏపీఎం, మండల సమాఖ్య సభ్యుల ఆధ్వర్యంలో ఆగస్టు చివరి వారంలో విచారణ చేపట్టారు. స్త్రీ నిధి మేనేజర్ చేసిన విచారణలో 27 గ్రూపుల్లో రూ.5.45 లక్షలు సభ్యుల నుంచి వసూలు చూసి బ్యాంక్‌కు చెల్లించలేదని అధికారులు గుర్తించారు. దీనిపై యానిమేటర్ వెంకటరమణను అధికారుల నిలదీయడంతో నెల రోజుల వ్యవధిలో సభ్యుల సొమ్ము బ్యాంక్‌కు చెల్లిస్తానని లేఖ రాసి ఇచ్చింది. అయితే గడువు ముగిసినా దుర్వినియోగం చేసిన డబ్బు పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు నీతిపూడి స్వర్ణలత గత నెల 26 న గ్రామ పంచాయతీ ద్వారా నోటీసులు జారీ చేయడంతో యానిమేటర్ అవినీతి బయటపడింది. దీనిపై ఏపీఎం సయ్యద్‌ని వివరణ కోరగా 27 గ్రూపుల్లో స్త్రీ నిధి, ఉన్నతి రుణాలకు భారీ మొత్తంలో అవుట్ స్టాండింగ్ ఉండడంతో స్త్రీ నిధి మేనేజర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించామన్నారు. విచారణలో రూ.5.45 లక్షలు నిధులు దుర్వినియోగం అయినట్టు నిర్ధారణ అయిందన్నారు. నెల రోజుల వ్యవధిలో రూ.2.40 లక్షలు రికవరీ చేశామని, రూ.3.05 లక్షలు రికవరీ చేయవలసి ఉందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నిధులు రికవరీకి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏపీఎం సయ్యద్ తెలిపారు.

పౌర సరఫరాల సంస్థలో 825 మందికి ఉద్యోగాలు


నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లా పౌరసరఫరాల సంస్థలో వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసిన 825 మంది అభ్యర్థులకు గురువారం నియామక ఉత్తర్వులను కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ ద్వారంపూడి భాస్కరరెడ్డిలతో కలిసి అందజేశారు. 275 మంది టెక్నికల్ అసిస్టెంట్స్, 275 మంది డేటా ఆపరేటర్స్, 275 మంది హెల్పర్స్‌ను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేసినట్లు కలెక్టర కృతికా శుక్లా వివరించారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు ఈ నెల 6, 7 తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. ఎంపికై న అభ్యర్థులు జిల్లాలో ధాన్యం సేకరణలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడం, రికార్డులను పొందుపరచడం చేస్తారని తెలిపారు. ధాన్యం సేకరణ నిర్ణీత కాలంలో పూర్తి చేసి రైతులకు సహాయసహకారాలు అందించాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు.

అమ్మాయిలు అదరగొట్టారు

- నేషనల్ రోప్ స్కిప్పింగ్‌లో 12 పతకాలు
- 6 బంగారు, 4 వెండి, 2 కాంస్యం


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, పీడీ, పీఈటీలు

తుని రూరల్: మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 24వ నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీలలో తుని మండలం వి.కొత్తూరులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు అదరగొట్టారు. గత నెల 29 నుంచి ఈ నెల నాలుగు వరకు పోటీల్లో గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. అండర్ –14 విభాగంలో ఇద్దరు ఐదు మెడల్స్, అండర్ –17 విభాగంలో ముగ్గురు ఏడు మెడల్స్ సాధించారు. ఇందులో ఆరు బంగారు, నాలుగు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలకుమారి తెలిపారు. మెడల్స్‌తో తిరిగి వచ్చిన విజేతలకు పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. అండర్ 14 విభాగంలో మెడల్స్ సాధించిన ఎ.అనిల, వై.జ్యోతి, అండర్ 17 విభాగంలో మెడల్స్ సాధించిన బి.గీతిక, టి.పావని, కె.స్నేహలను ప్రిన్సిపాల్ , ఫిజికల్ డైరెక్టర్ జయలక్ష్మి, పీఈటీ సాధన అభినందించారు.